

# యజ్ఞం

## – శేషచంద్ర

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

**కొన్ని గ్రామాలు తప్పితే** చాలా గ్రామాల్లో సమస్యలన్ని ఒక్కలాగే అనిపించింది. బోర్లు ఎండిపోయి ఒకటి రెండు కిలోమీటర్లు నడిచి పొలల్లోంచి నీళ్లు తెచ్చుకొంటున్నారు. చూపుడుకు వాటర్ టాంక్లున్నాయి .టాంకు నిండేందుకు కరెంటు ఉంటే ఉంటుంది లేకపోతేలేదు. ఉన్నా సరైనా ఓల్టేజి ఉండదు. సరైన బడిలేదు .రోగమెస్తే ఆసుపత్రిలేదు. కరెంటు కోతతో రాత్రిళ్లు కిరోసిన్ బుడ్డిలే గతి. పట్టుమని వంద ఇళ్లున్నా చోటకూడా రెండు పార్టీలు . గొడవలు. ఐక్యతన్నదే లేదు. ఇంట్లో ఈగల మోత బైట పల్లకిల మోత అన్నట్లు బైటకొస్తే చోటా చోటా నాయకులంతా డాబుగా నలగని ఖద్దరు సొక్కాలేసుకొని కార్లల్లో పని లేకున్నా రాజకీయనాయకులెంట తిరుగుతుంటారు గాని అంతా ఒక్కటిగా ఉండి పల్లెలు బాగు సేయించుకోవాలని ఒక్కరికి ఉండదు.ఆధిపత్య పోరు ఎక్కువ. ఒక పార్టీ గెలిచినప్పుడు ఒకరిది పై చెయ్యి అయితే మరో సారి మరో పార్టిది. వాళ్ల మధ్యన నలిగిపోయేది బలహీనులు బీదవాళ్లైన బలహీనులు.

త్రాగునీటి సమస్య, రోడ్లు, మురిక్కాలువల సమస్య విధ్యుత్ సమస్యలు . డబ్బుతో ముడిపడినవి. పెద్ద సమస్యకాదనిపించింది. వాటిని దశలవారిగా తన స్వంత డబ్బుతో చేయిస్తామని మాటిచ్చాడు రుద్ర. జటిలంగా ప్రముఖంగా కనపడుతున్న ఆధిపత్యం దోరణి. దాంతో అణగదొక్క బడుతున్న బలహీనుడు పేద వాడు. పేదవాడికి ప్రతి పల్లెలో పొలాల గట్ల దగ్గర ,పొలాలకెళ్లే దారుల్లో ఇళ్ల దగ్గర అన్యాయం జరుగుతుంది. పొలాలుకు వెళ్లేదారులు పెద్దల ఆక్రమణలకు గురికావడంతో వెళ్లేందు కు సరైనా దారిలేక నీటి వసతి ఉన్నా బీడు పెట్టబడిన పొలాలు కనపడ్డాయి . గ్రామ న్యాయాలయాలు న్యాయఅదాలత్తులు ఎన్ని ఉన్నా బలహీనుడు పరిస్థితి మార్పు కనపడక అటవిక న్యాయం ఇంకా కొనసాగుతునే ఉన్నట్లనిపించింది. అన్యాయాలను భరించలేక ఎవరైనా ఎప్పుడైనా ఎదురుతిరిగితే వాని మీద దాడులు అక్రమకేసులు పెట్టి బెదిరించి ఇంకొకడు ఎదురుతిరగకుండా తమ ఆధిపత్యానికి భంగం కలగకుండా చేసుకొంటున్నట్లు తెలిసింది. మార్పు రావాలంటే ఆ బలహీనులందరికి తోడు అవసరమని అందుకోసం న్యాయంకోసం పోరాడేలా యువతను ఒక్కటిగా చేసి జరుగుతున్న అన్యాయలను ఎదుర్కోనేందుకు సిద్ధం చేయాలనిపించింది రుద్రకు.

ముందుగానే రుద్ర మీద కోపంతో రగిలిపోతూ ఎలా ప్రతీకారం తీర్చుకోవాలా అని ఎదురు చూస్తున్న అబ్బిరెడ్డికి ఇప్పుడు రుద్ర గ్రామాల్లో తిరుగుతూ తనకు పోటిగా తయారు కావడంతో పాటు తనకు కోడలు కావల్సిన సంధ్య రుద్రకు భార్య కాబోతుండటాన్ని జీర్ణించుకోలేక పోయాడు. అతను రంగలోకి దిగాడు. పల్లెల్లోకి రుద్ర వాళ్లను రానీయకుండా అడ్డు తగిలేలా చేసాడు. కొన్ని గ్రామాల్లో అది సఫలమైనా కొన్ని చోట్ల గ్రామంలో ప్రజలు రుద్ర వాళ్లకు అండగా నిలబడటంతో వాళ్లను నిలవరచడం సాధ్యం కాలేదు. వచ్చిన మార్పును చూసి రుద్ర వాళ్లను అలాగే వదిలితే తన రాజకీయ జీవితానికి ముప్పు తప్పదనిపించి ఏదైతే అది అవుతుందని రుద్ర కడతేర్చేందుకు పథకం వేసాడు అబ్బిరెడ్డి.

ఒక రోజు రుద్ర వాళ్లు గ్రామం నుండి తిరిగి వస్తుండగా రోడ్డు కాచి కిరాయి ముఠా కత్తుల్తో కర్రల్తో విరుచక పడ్డారు. తమను భయపెట్టేందుకు ఈలాంటి ఏదో ఒకటి చేయిస్తాడని ఊహించినా మరిఅంత బరితెగించి చంపే ప్రయత్నం చేస్తాడని అనుకోలేదు రుద్ర. తేరుకొని రుద్ర వాళ్లు తిరగబడ్డా, దాడికి తెగబడిన వాళ్లు ఎక్కువ కావడం వాళ్ల చేతుల్తో ఆయుధాలు ఉండటంతో వాళ్లదే పై చేయి అయ్యింది. కిరాయి హంతకులు కావడంతో అందిన వారిని అందినట్లు నిర్ధాక్షణ్యంగా కత్తుల్తో పొడిచి పారిపోయారు.

త్రీవమైన గాయాల్తో కొన ఊపిరితో ఉన్న రుద్రను అతని స్నేహితుల్ను పక్క గ్రామం వాళ్లే ఆసుపత్రికి చేర్పించారు. రోదనల్తో ఆసుపత్రి మిన్నుముట్టింది. కొద్ది పాటి గాయల్తో పూజారి జార్జి స్వామి జాఫర్లతో పాటు మరికొంత మంది బైటపడగా రుద్ర, బికారిలు త్రీవగాయాలతో సృహలేకుండా పడి ఉండటం అందర్ని కలిచి వేయసాగింది. సావిత్రమ్మ కొడుకు స్థితిని చూసి తట్టుకోలేక సృహతప్పుతునే ఉంది . ఎంకట్రెడ్డి చలించిపోయాడు. సంధ్య ఆమె అమ్మానాన్నల పరిస్థితి ముసలామె సంగతి చెప్పనక్కర్లేదు.

దాదాపు పది గంటల తర్వాత సృహలోకి వచ్చాడు రుద్ర. డాక్టరు సృహ వచ్చింది అని చెప్పగానే సావిత్రమ్మ ఎంకట్రెడ్డిని ఐసియులోకి పరుగుతీసారు. సృహ రాగానే రుద్రకు బికారి గుర్తుకొచ్చాడు. తనను కత్తితో పొడుస్తున్నప్పుడు వాళ్లతో ఎదురు తిరగడం వాళ్లు బికారిని అడ్డదిడ్డంగా పొడవడం గుర్తుకొచ్చింది. ఇప్పుడేలా ఉందో పాపం అని కంగారు పడ్డాడు . పదే పదే బికారి మాటలు గుర్తుకు రాసాగాయి.

ప్రతి సారి భయపడుతూ తనను వదల్లేక తన వెంట రాలేక భయపడ్తూ బికారి చెప్పే మాటలు మనసులో మెదిలాయి. కన్నీళ్లు కారుస్తు తన వంకే చూస్తున్న తల్లితండ్రుల్ను చూసి తనకేమి కాదని ధైర్యం చెప్పి బికారి గురించి అడిగాడు.

సృహలోకి వచ్చాడని ఇంకా పరిస్థితి క్రిటికల్గానే ఉందని తెలుసుకొని డాక్టర్లు సావిత్రమ్మ ఎంకట్రెడ్డిలు ఎంత వారిస్తున్నా బికారిని చూడాలని మట్లాడాలని పట్టుబట్టాడు రుద్ర. తప్పని సరి పరిస్థితిలో రుద్రను బికారి వద్దకు తీసుకపోయారు స్టెచ్చర్ మీదనే.

రుద్రను చూడగానే నీరసంగా చూసాడు. ఆచూపుల్లో " సూసినావా ఎంత పని జరిగినాదో నా మాట ఇన్నావు కావు ఇయి పిల్లాటలు కావని ముందుగానే సెప్పినా" అనిపిస్తుంటే రుద్ర అతని చేతిని తనచేతిలోకి తీసుకొన్నాడు బికారి . బికారి రుద్ర చేతిని గట్టిగా పట్టుకొంటూ" నేను బ్రతుకుతానని అనిపించటంలా రా. నేను పోతే మా అమ్మ నాయనకు ఎవరు దిక్కులేర్రా వోల్లను సూసుకొరా "అంటూ కన్నీరు కార్చాడు బికారి. గుండెలు పిండి నట్లైంది రుద్రకు. తను తప్పుచేస్తున్నానా అని అనిపించింది. ఆ తర్వాత కొద్ది గంటలకు బికారి చనిపోయాడు.

బికారి మరణంతో వెంకటాపురం అట్టుడికిపోయింది. రెచ్చిపోయిన యువకులు ఒక్కసారిగా మిట్టమాని పల్లెకు పోయి అబ్బిరెడ్డి మీద దాడి చేసేందుకు సిద్ధమయ్యారు. ముందుగానే ఈలాంటాదేదో జరుగుతుందని ఊహించిన అబ్బిరెడ్డి పోలీసుల్తో వెంకటాపురం నుండి యువకులు ఎవరు బైటికి రాకుండా దిగ్బంధం చేయించాడు. . ఈ ఘాతుకం చేసింది అబ్బిరెడ్డేనని పార్టీ హై కమాండ్కు చెప్పినా వాళ్లు అబ్బిరెడ్డినే వెనకేసుకొని రావడంతో పాటు వాళ్లిద్దరి మధ్య సయోధ్య కుదిరించేందుకు పార్టీ పెద్దలను పంపడంతో రాజకీయాలమీద అసహ్యమేర్పడింది ఎంకట్రెడ్డికి. రుద్రను చూసేందుకు ఆసుపత్రి వద్ద జనాలు పోటెత్తారని తెలుసుకొని ఆలోచన్లో పడినా హై కమాండ్ తనకు అనుకూలంగా ఉండటం రుద్ర బెడ్ మీద ఉండటం ఊరటనిచ్చింది అబ్బిరెడ్డికి

కాని ఆ సంతోషం ఎంత కాలం అబ్బిరెడ్డికి నిలబడలేదు.

వెంకటాపురంలో పోలీసులను మోహరించడంతో ఇక తనకేమి ప్రమాదం లేదనుకొని ధీమాగా ఉన్నసమయంలో ఓ ఆరు మంది పోలీసులు జీపులో మిట్టమాని పల్లెకు వెళ్లారు. నలుగురు పోలీసులు జీపులో ఉండగా మిగతా ఇద్దరు లోపలికి వెళ్లారు. పోలీసులు దుస్తుల్లో ఉన్న వాళ్లను చూచి పోలీసులే అనుకొని అబ్బిరెడ్డి అనుచరులు అడ్డు చెప్పలేదు. పోలీసులను చూసి కంగారు పడుతూ ఏం జరిగిందో నని బైటికి వచ్చాడు అబ్బిరెడ్డి. "వెంకటాపురం యువకుల్ను పోలీసులు నిలవరించలేక పోయారని వాళ్లంతా మూకుమ్మడిగా వస్తున్నారని మీరు వెంటనే ఇక్కడ్నుంచి వెళ్లి పోతే మంచిదని తమ వెంట రమ్మని" చెప్పగానే భయంతో ఓ పక్క పారిపోవడం అవమానంగా బావించిన అబ్బిరెడ్డి అదనపు బలగాలకోసం ఎస్పీకి ఫోన్ చేస్తుండగా దగ్గర్నించి వాళ్లలో ఒకడు కాల్పులు జరిపాడు. బుల్లెటు గురితప్పి భుజంలోకి దిగబడటంతో కూలబడ్డాడు అబ్బిరెడ్డి . బులెట్టు శబ్దం విని బైటనుండి అతని అనుచరులు లోపలికి పరిగెత్తుక వచ్చి పోలీసులు ఆబ్బిరెడ్డిని ఎందుకు కాలుస్తున్నారో అర్థంకాక తేరుకొని వాళ్లపైన తిరగబడేలోగా పోలీసులు వేషంలో ఉన్న వాడు మరోసారి అబ్బిరెడ్డిని కాల్చేసి అబ్బిరెడ్డి అనుచరుల్ను రివాల్వర్తో బెదిరిస్తూ బైటనున్న జీపులో పారిపోయారు. తేరుకొని వాళ్లను వెంబడించేలోగా జీపు మాయమయ్యింది.ఆసమయంలో పోలీసులకు ఫోన్ చేసినా కూడా పోలీసులంతా వెంకటాపురంలో ఉండటంతో కాల్పులుకు తెగబడ్డవాళ్లు తప్పించుకొగలిగారు. అబ్బిరెడ్డిని ఆసుపత్రిలోచేర్పించారు. పేపర్లో పొద్దునే అబ్బిరెడ్డి

పై జరిగిన దాడిని నాయకులు భిన్నంగా స్పందించారు. పాలక పార్టీలోనే లుక లుకలు అని ప్రతిపక్షపార్టీ దుమ్మెత్తి పోసింది. అబ్బిరెడ్డి కావాలనే సానుభూతికోసం ఈ డ్రామా ఆడించాడని మరి కొంత మంది విమర్శించారు.

వెంకటాపురం వాళ్లు సంతోష పడ్డారు. అబ్బిరెడ్డి చచ్చిపోవాలని అని దేవున్ని వేడుకొన్నారు బికారి తల్లితండ్రుల్తో సహా చాలా మంది. చావుకు బెత్తడంతా దూరంలోకి వెళ్లిన అబ్బిరెడ్డికి మొదటి సారిగా భయమేసింది. తనను కాల్చిన వాళ్లెవరో అంతు చిక్కలేదతనికి. రుద్ర వాళ్లు ఆ పని చేసి ఉంటారని అనుకొంటుంటే నిద్ర పట్టలేదు ఏ సమయానికి ఏం జరుగుతుందో నని..

❦❦❦

రుద్ర ఇంకా రెస్టు తీసుకోవాలని చెప్పడంతో ఆసుపత్రినుండి డిశ్చార్జ్ అయినా ఇంటి వద్దే ఉన్నాడు రుద్ర. పూజారి, జార్జ్, జాఫర్ ,స్వామిలు పూర్తిగా కోలుకొన్నారు. కాని ఇంత జరిగినా వాళ్ల మధ్య స్నేహం తగ్గక పోగా మరింత పెరిగింది. వాళ్లు రోజు వచ్చి రుద్రను కలిసిపోతున్నారు. పరమేశం కూడా వచ్చి రుద్రను పలకరించిపోయాడు. బికారిని కోల్పోవడం రుద్ర మిత్రబృందానికి కోలుకోని దెబ్బలా అనిపించింది. బికారిని గురించి తలుచుకొన్న ప్పుడల్లా వాళ్ల కళ్లు చెమ్మగిల్లసాగాయి. అదే సమయంలో అబ్బిరెడ్డి మీద కోపం రెట్టింపుకాసాగింది. బికారి కుటుంబానికి పూర్తిగా అండగా నిలబడ్డాడు ఎంకట్రెడ్డి. బికారి తండ్రి పేర రెండెకరాల మాగాణి రిజిస్టరు చేయించడమే కాకుండా ఏ అవసరమెచ్చినా ఆదుకొంటానని చెప్పాడు. అబ్బిరెడ్డితో తాడో పేడో తేల్చుకోవడానికే సిద్ధపడ్డాడు.

❦❦❦

తుఫాన్ వల్ల వాతవరణంలో మార్పు వచ్చి ఉదయం నుండి సన్నని జల్లులు రాల్తున్న వర్షం చీకటి పడే సమయానికి ఉధృతమైంది. వర్షంతో పాటు చలిగాలులు వీస్తుండటంతో ఎక్కడి వాళ్లు అక్కడ వాకిళ్లు బిగించి పడుకొన్నారు. ఇళ్లలోపల కుక్కలు కూడా వెచ్చని ప్రదేశాలు చూసుకొని నిద్రలోకి జారుకొన్నాయి . వర్షం శబ్దం, ఈదురు గాలుల శబ్ధం తప్ప మరే శబ్దం లేదక్కడ.

రుద్రకు నిద్ర పట్టక పుస్తకం తీసుకొని చదువుకొంటున్నాడు. బైట ఏదో మోటర్ బైక్ ఆగినట్లన్పించింది. ఈ సమయంలో ఎవరొచ్చారబ్బా కిటికిల్లోంచి చూసాడు. మిద్దెపైనా తనొక్కడే పడుకొంటున్నాడు. క్రింద ఎంకట్రెడ్డి , సావిత్రమ్మ ముసలామె పడుకొంటున్నారు. ఎర్రోడు పశువుల కొట్టం పక్కనున్న రూంలో పడుకొన్నాడు. ఎంకట్రెడ్డి మునపటిలా బైట తిరగడంలేదు. అతని కోసం ఎవరు వచ్చినా ఎక్కడికి వెళ్లడం లేదు. ఇక పార్టీ తరుపున పనిచేయనని సున్నితంగా తిరస్కరిస్తూ వచ్చాడు. కాబట్టి వచ్చింది తండ్రికోసం కాదనపించింది. అయినా అంత రాత్రి వేళ తుఫాన్ వాతవరణంలో రావల్సిన అవసరమెవరికి ఉంటుంది. ఒక వేళ అంత అవసరమున్నా ఫోన్ చేస్తే సరిపోతుంది కదా. అబ్బిరెడ్డి మళ్లీ తనపైనా హత్యా ప్రయత్నం చేయించబోతున్నాడా అనుకోగానే కోపంతో రోమాలు నిక్కబొడుచుకొన్నాయి. ఓ మూలనున్న వేటకొడవలి చేతికి తీసుకొన్నాడు రుద్ర. వచ్చిన వాడు మోటారు బైక్కు చీకట్లోనే పార్క్ చేసి అటు ఇటు దొంగలాగా చూస్తూ మిద్దెపైకి రాసాగాడు. చీకట్లో వచ్చిన వాడు ఎవరో అంతుచిక్కడంలేదు. పూర్తిగా రెయిన్ కోటుతో

ముఖానికి కూడా టొపి పూర్తి గా కప్పివేసి ఉండటంతో ఎవరైంది తెలియడంలేదు. చేతుల్లో ఏముందో చీకట్లో కనపడటం లేదు. ఒక్కడే వచ్చాడా లేక ఇంకా చాలా ముంది ఉన్నారా. వచ్చిన వాడు తలుపులు పగలగొట్టుకొని వస్తాడా అనుకొంటుండాగా వచ్చిన వాడు తలుపుమీద చిన్న గా శబ్దం చేస్తూ "రుద్రన్నా రుద్రన్నా "అని పిలిచాడు.

పరిచయమైన గొంతులాగే అనిపించింది. "ఎవరు? "అన్నాడు వాకిలి తీయకుండానే.

"ముందు లైటు ఆర్పేసి వాకిలి తీయన్న చెప్తా " అన్నాడు వచ్చినవాడు.

వాకిలి తీసేందుకు రెండు క్షణాలు తటపాయిస్తూ , వాడు దాడి చేస్తే ఎదుర్కోనేందుకు సిద్దపడుతూ రుద్ర వాకిలి తీసాడు. లోపలకి వచ్చిన వాడు లోపలికి రాగానే వాకిలి వేసేసాడు తనే. కొడవలి చేతిలో పట్టుకొని నరకడానికి సిద్దంగా ఉన్న రుద్ర చూడాగనే వచ్చిన వాడు , తల మీదనున్న హ్యాట్ ముఖానికి అడ్డం ఉన్న గుడ్డ తీసేస్తు "రుద్రాన్నా నేను నేను నరేంద్రను . వరదయ్య కొడుకును "అన్నాడు భయంకంపితుడౌతూ .

షాక్ తిన్నాడు రుద్ర . అది కల నిజమా అర్థం కాలేదు. అయోమయ స్థితిలోంచి తేరుకొనేందుకు కొద్ది క్షణాలు పట్టింది రుద్రకు. నరేంద్రను గుర్తు పట్టేందుకు ప్రయత్నించాడు. పూర్తిగాగుండుతో మీసాలు తీసేసిన అతన్ని పరిశీలనగా చూస్తూ అతనిలో నరేంద్రను పోల్చుకొని సంభ్రమాశ్చర్యంతో ,

" నువ్వు నువ్వేనా . అంతా చనిపోయారనుకొంటున్నారంతా .. "అన్నాడు.

"లేదన్నా ...నేను చనిపోలేదు. "

"మరి చనిపోయినేది ఎవరు "

"సోమిరెడ్డి. "

నమ్మశక్యం కాని అతని మాటలకు మరింతగా ఆశ్చర్యపోయాడు రుద్ర.

"అవునన్నా ఆ నాకొడుకునే నేనే చంపేసాను. మా నాన్న ఏలా మంటల్లో పడి కాలిపోయాడో అలాగే వాడ్ని చంపేసినా.. ".

"నమ్మలేకున్నా అదెట్లా జరిగినాది.వోడ్ని నువ్వు చంపడమేంది .నువ్వు చనిపోయినట్లు ఆనవాలున్నాయక్కడ. . అసలేం జరిగినాది. ఇప్పుడెక్కడున్నావ్ ఎక్కడ్నుంచి వచ్చావ్ ఈ తుపాన్లో .ఎమన్నా తిన్నావా లేదా "అంటూ ఆప్యాయంగా ప్రశ్నల వర్షం కురిపించాడు. ఏమి తినలేదని తెలుసుకొని పండ్లు బిస్కెట్లు తినమని ఇచ్చాడు. వాటిని తింటూ రుద్ర మిత్రలందర్ని ఏలా ఉన్నారని అడిగి బికారి చనిపోవడం గురించి బాధ పడ్డాడు.

"వాడే కదన్నా ఈ పని చేసినేది. అందుకే వాడ్ని చంపాలనుకొన్నాం . కాని తప్పించుకొన్నాడు " నరేంద్ర రావడమే ఆశ్చర్యంగా ఉంటే అతని మాటలు ఆశ్చర్యమీద ఆశ్చర్యాన్ని కలగచేయసాగాయి రుద్రకు.

“నువ్వుచెప్పేది నాకేమి ఒక్కటి నమ్మలేక పోతున్నా. నువ్వు చావునుంచి తప్పించుకొన్నావంటే నిన్ను సూస్తున్నా కాబట్టి నమ్మాల్సి వస్తుంది. సోమిరెడ్డిని నువ్వు చంపడమేంది అబ్బిరెడ్డి మీద దాడి చేసింది మీ వాళ్లంటుండావు. మీ వాళ్లెంటే ఎవరు. నువ్వింత కాలం యాడున్నావ్. ఏం చేస్తుండావ్. అసలేం జరిగినాది?“ అన్నాడు

“ సెప్తానన్నా జరిగినేదంతా ఫోనులో సెప్పి నిన్ను ఇబ్బంది పెట్టడం ఇష్టం లేక నీతో కలిసి సెప్పాలనే అనుకొన్నా కాని వీలు పడలా. అసలా దినం సానా భయంకరమైన రాతిరి. తలుచుకొంటే ఇప్పటికి భయమేస్తాంటాది. “అంటూ జరిగిన సంఘటన కళ్లముందు కనిపిస్తున్నట్లుగా చెప్పసాగాడు.

“పొలాల్లో చాల మటుకు వరి కోతలు అయిపోయినాయి. మా పొలంలో నాట్లు ఆలస్యంగా పడటంతో ఆలస్యంగా కోతకు వచ్చినాది. మీరు ఊరికాడ్నించి పంపిన కూలోళ్లతో వరి మెత్తం కోయడమైతే అయ్యింది గాని నూర్పడం మాత్రం సగమే అయినాది. వోళ్లు రెండుదినాలు రామంటే నూర్పిడి అయిన వడ్లు సంచులకెత్తించి అక్కడే పొలంలోనే పెట్టించి , నూర్పిడి చేయని చెత్తను వానేమైనా వస్తాదని వామి ఏయించినా . అక్కకు ప్రసవసమయం గావడంతో అమ్మ అక్కోళ్లింటికి పోయినాది తోడుకొసరం. పనంతా నా మీదేపడినాది. పని కన్నా ఒంటిగా పొలం పడుకోవాలంటే భయమేసినాది. సేసేదేంలేక అన్నం తినోచ్చి పడుకొన్నా. దూరంగా ఇద్దరో ముగ్గరో పొలాల్లో పడుకొని ఉండటంతో కొద్దిగా దయిర్నం తెచ్చుకొన్నా కాని భీతిభీతిగా ఉంది లోపల. కాపలా ఉన్నవోడు ఎవడో ఒకరు మందు బాగా లాగించినట్లుంది. చెల్లియో చెల్లకో అంటూ రాయబారం పద్యా లు కొద్దిసేపు , సత్య హరిశ్చంద్ర కాటి సీను పద్యాలు కొద్ది సేపు గ్యాపులేకుండా పాడి పాడి అలిసిపోయిండో, కైపు ఎక్కువైనిద్రపోయిండో గాని సైలెంటయిపోయిండు. కీచురాళ్లు గీ అని అరుస్తూ , మద్దెమద్దెన గోదుర కప్పలు వింత శబ్దం సెసేటప్పుడు ఆగి మళ్లీ అరుస్తుండాయి. వోటికి జతగా మా పొలమానుకొని ఉండే సింత సెట్టు మీద కూకున్న గుడ్ల గూబా వళ్లు జలదరించేలా అరుస్తుంది. చీకటి ఏమి కనపడటంలా భయంతో ఉన్నచోటనుండి కదలకుండా పడుకొండి పోయినా. ఆ సమయంలో మా నాయన గురుతుకొచ్చిండు ఒక్క పూటకే ఇంత భయమేస్తాదేందే మా నాయన ఒక్కడే ఈడికొచ్చి ఎట్టా నీళ్లు కట్టుకొనే వోడో . నాయన గురుతు రాగానే . బాధలో భయం కొట్టుకపోయి ఆలోచనలన్ని ఆయన చుట్టు తిరగసాగాయి. నాయన పండించే టప్పుడుకన్న పంటా బాగా విరగ్గాసింది. ఆయనే బతికుంటే ఎంత సంతోష పడేవోడో అనుకొన్నా. అట్టా ఆలోసిస్తున్న నాకు చెట్టు దగ్గర అలికిడి కావడంతో తల తిప్పి సూసినా. సెట్టు కింద నల్లని రూపుతో ఓ ఆకారం నా వయిపే సూస్తున్నట్టు అనిపించినాది. దాని కళ్లు సీకట్లో మెరుస్తాంటే నా దయిర్నం నీరుకారిపోయినాది. అది నాయనాత్మమేమో నా పక్కన సూస్తుండాది అనుకోగానే వళ్లంతా సెమటలు పట్టేసినాయి ఆ ఆకారం నా వయిపే వొస్తుండటంతో కూకోని, వళ్లంతా కాలిపోయి వికృతంగా మారిపోయిన నాయన రూపం యాడ సూడాల్సి వస్తాదో అని లైటు వేసేందుకు కూడా భయపడిపోయినా . అది నా కాడికి వస్తుండటంతో గుండెనిండా దయిర్నం తెచ్చేసుకొని లైటేసినా . లైటు మీద పడగానే

గట్టిగా అరుస్తూ పక్కనున్న కాలువలోకి దూకి పరుగుతీసింది. అది అడవి పంది. దాని అరుపుకు వళ్లంతా జలదరించి వళ్లంతా చెమటలు పట్టినయి. సాన సేపటికి గాని మామూలు మనిషి కాలేక పోయినా . పంది ఒకసారి వచ్చిపోయినాదంటే మళ్లా వస్తాది. ఈ సారి ఒంటగా రాదనిపించినాది. వాటిని ఎదుర్కోడానికి తెచ్చుకొన్న ఈటెను దగ్గర పెట్టుకొని వేసుకొన్న మంచె ఎత్తుతక్కువ ఉండటంతో అవి వచ్చి యాడ మీద పడతాయో నని సెట్టు ఎక్కి కూర్చున్న .దుప్పటి నిండుగ కప్పుకొన్ని అలాగే కూర్చుండిపోయిన నాకు నిద్ర ఎప్పుడు పట్టిందో ఉన్నట్లుండి మెలుకవ వచ్చింది . కళ్లు తెరిచి చూచేటప్పటికి తదియనాటి చంద్రుడు నడి ఆకాసం మీదికి వచ్చి వెన్నెల కురిపిస్తుండాడు. ఎండిన వరిగడ్డి మీద పరుచుకొన్న వెన్నెల్లో పొలాల మీద అంతా బంగారు పరిచినట్లుంది. ఏదో అలకిడి వినిపించింది. సెవులు రిక్కబొడుచుకొని ఇన్నా. పక్కచేల్లో నుంచి మెల్లగా అడుగులో అడుగు వేసుకొంటు ఎవరో వస్తున్నట్టనిపించినాది. అడివి పందులు వస్తాయనుకొన్నా గాని దొంగలు వొస్తారనుకొలే . .ఇద్దరో ముగ్గురుంటే అడ్డపడలేననుకొని వోళ్లు ఎత్తుకొని కొని దూరంగా పోయాక కేకలేస్తాననుకొని చేతిలో ఈటె టార్చి లైటు తీసుకొని సడి సప్పుడు సేయకుండా చూస్తుండిపోయినా . గడ్డి వామి దగ్గరికి సప్పుడు చేయకుండా వచ్చిండు ఒకడు. ఎవరైంది తెలియలా నిండాదుప్పటి కప్పుకొన్నడు. ఎవడు వోడు మా ఊరూడేనా . ఒక్కడు వచ్చి ఎన్ని మూటలు మోసుకపోతాడు అనుకొంటు చూస్తున్న నాకు వోడు మూటల కాడికి పోకుండా .మంచె కాడికి వచ్చి సూసి ఎవడు లేరనుకొని వామి కాడికి ఎల్లడం చూసి ఆశ్చర్యమేసినాది. వోమి కాడికి ఎల్లిన వోడు ఆలస్యం సేయలా జేబులోంచి ఏదో తీసాడు కుడి చేతిలోని దాన్ని ఎడమచేతిలోకి మార్చుకొన్నడు. వోడేం సేయబోతున్నాడో నాకు అర్థమయినాది. వా డు ఒక్కడే ఉండటంతో భయపడకుండా చెట్టుదిగినా . ఆ సమయంలోనే వోడు అగ్గిపుల్ల ఎలిగించి చెత్త మీద వేసిండు. ఆ ఎల్తుర్లో వోడు ఎవరో తెలిసిపోయినాది. వోడు సోమిరెడ్డి. వాడు వరి చెత్తను కాల్చేదానికి వచ్చినాడని తెలియగానే నా ఒంట్లో రకతం. సలసలా కాగిపోయింది. వామి కొద్దిగా అంటుకొని మంటలేచింది. నేను ఆలిసం సేయకుండా గట్టిగా అరిస్తూ వోడికాడికి పోయినా . ఉన్నట్టుండి శబ్ధం రాగానే వోడు అదిరిపడిండు. చేతిలో అగ్గిపెట్టె క్రిందపడినాది. ఆడ్నుంచి పారిపోవాలని సూసిండు. “ నా కొడకా మా నాయన్ను పొట్టన పెట్టునకొన్నావ్ ఇంగా నీకు కచ్చ పోలేదా “ అంటూ మీదికి వస్తున్న నన్ను సూసి పోతున్న వోడల్లా“ ఒర్ని నువ్వా పిల్లకుంకా ఎవరో అనుకొన్నా నే , సోమిరెడ్డి నా వామిని కాల్చేసిండని ఎవర్తో సెప్పుకొంటవో సెప్పుకో. వోడెవడ్నో అడ్డం పెట్టుకోని నన్నుజైలు పంపిస్తార్రా . మీ నాయన కాల్చుకొని సావలా మేమే సంపించినాం. ఆ పెట్రోలు అబ్బిరెడ్డిని తిట్టిన రుద్రగాన్ని ఏసి కాల్చాలని తెచ్చినం .వోడు తప్పించుకొనిండు. మీ నాయన ఆ పెట్రోలుచూసి మమ్మల బెదిరించాలనిచూసి పెట్రోలు మీదేసుకొని నన్ను,అబ్బిరెడ్డిని అడ్డంగా తిట్టడం మొదలెట్టిండు. దాంతో మాకు కోపం వచ్చినాది. అబ్బిరెడ్డి సైగచేసే సరికి మీ నాయనకు నేనే అగ్గిపెట్టిచ్చినా . దానికి సాచ్చం లేదు. దీనికి అంతే. నువెట్టా ఈడ ఎట్ట సేద్దం సేస్తావో సూస్తా“ అంటూ వాడు ఎగతాళిగా నవ్వుతూ నిబ్బరంగా నిలబడిండు. నాలోన ఆవేశం కట్టలుతెంచుకొన్నాది. మంటల్లో కాలిపోయి నరక యాతన అనుభవిస్తు సనిపోయిన మా నాయన కనపడిండు. మా నాయన సావలేదని, సంపినోడు

ఎదురుగా నిలబడి సవాలు ఇసురుతూ , పండిన పంటకు అగ్గి పెట్టి నిర్భయంగా నిలబడి ఎగతాళి చేస్తుండటం తో నా రక్తం సెగలు కక్కింది. “మమ్మల నాసనం సేసి యాడికిరా పోతావురా నాకొడకా“ అంటూ ఈటెను పైకెత్తినా . మంటల ఎల్తుర్లో ఈటెతో ఉగ్రంగా కనిపిస్తున్న నన్ను సూడగానే వోడి గుండె ఆగినట్లైంది. నా కాడ ఈటె ఉంటాదనుకోలే వోడు .సుట్టు పక్కల కట్టె ఏమన్నా ఉందేమో అటూ ఇటు సూసిండు. వోడికి ఏమి కనపడలా . భయమేస్తున్నా “ఏందిరా ఈటెత్తినవు పొడుస్తావేంది “అంటూనే రెండడుగులు వెనక్కి వేసాడు . నేను వోడి ముందుకు దూసుక పోయినా . “నేను మా నాయన మాదిరగా గాదురా నువు సేసే పనులు సూస్తు సేతులు కట్టుకొని గమ్మనుండను పొడుస్తానో లేందో సూడు“ .అంటూ ఈటెను పైకెత్తి గురి చూసి సోమిరెడ్డి గుండెల్లో బలంగా దించిన. వోడు ఊహించలా నేనట్లా పొడుస్తానని . ఈటె గుండెలవైపు రాబోతుంటే భయంగా అరుస్తూ ఈటెను పట్టుకొబోయాడు కాని వాడి చేతుల్ను కోసుకొంటూ ఈటె గుండెలో బలంగా దిగి వీపుల్లోంచి బైటిక వచ్చింది. నేను అంతటితో ఆగలే వేగంగా ముఖం మీద బలంగా తన్ని ఈటెను వెనక్కి లాగేసినా . రక్తం పిచికారితో కొట్టినట్లు చిమ్మింది. ఈటె ఊడి రావడంతో పాటు నేను తన్నిన తన్నుకు వోడు వెల్లకిలా పడిపోయాడు. కింద పడిన వోడు ప్రాణ భయంతో రెండుచేతులు జోడిస్తున్నా పట్టించుకోకుండా ఈటెను మళ్లీ ఈ సారి కసుక్కున గొంతులో దించినా . కొద్ది సేపు వోడు గిలగిలా కొట్టుకొని సచ్చిపోయిండు. వోడు సనిపోయినాక కోపం తగ్గిపోయి భయమేసిందినాది. అదే సమయంలో వామి మంటలు ఎక్కవుతుంటే నీళ్లు తెచ్చి దానిని ఆర్పడం సాధ్యం కాదనిపించి , మంట వెల్తురుకు దూరంగా ఉండేవాళ్లు కూడా వస్తే నేను చేసిన పని తెలిసిపోతుంది. అక్కడ్నుంచి పారిపోయినా పోలీసులకు తను దొరికి పోక తప్పదనుకొన్న నేను ఏదో ఒకటి చేయాలని గబగబా వామిపైకి ఎక్కి పెద్ద గుంతపడేటట్టు వరిగడ్డి మోపులు తీసి , వాడి కాడ ఏమన్నా ఉండాయోమో నని చూసి డ్రాయరు జేబులో మోటార్ బైక్ తాళాలు తప్ప ఏమి లేక పోవడంతో వోటిని తీసుకొని వాడి బట్టలు , చెప్పులు,దుప్పటి నేనేసుకొని వోడికి నా బట్టలు తొడిగి , దాంతో పాటు నేను పొడిచిన ఈటెను నా కాళ్ల చెప్పులు, టార్చిలైటు, సెల్ కూడా అందులోనే ఏసి దాని పైన తీసిన వరి కట్టలు మళ్లీ కప్పిన . అప్పటికే మంటలు ఎక్కువ కావడంతో మరింత మండుకొనేలా చుట్టపక్కల మధ్యలో కూడా మండుకొనేలా చేసిన . దాంతో వామి మొత్తం ఒకే సారి అంటుకొంది. రక్తం పడిన సోటకూడా నిప్పెట్టినా. నేనక్కడ ఉండకుండా అక్కడ్నుంచి పరుగుతీస్తు మోటర్ బైకు దగ్గరకు వెళ్లి దాని మీద వెళ్లిపోయిందేకుసిద్దపడుతూ. ఎవరైనా వస్తున్నారేమో నని కొద్ది సేపు సూస్తుండిపోయినా. వామి పూర్తిగా అంటుకోవడంతో మంటలు పైకి ఎగిసినా ఏలాంటి అరుపులు వినపడక పోవడంతో సోమిరెడ్డి అప్పటికేచాలా మటుకు కాలిపోయింటాడని బైక్లో అక్కడ్నుంచి బైటపడినా చలికాలం గావడంతో అంతా ఇళ్లలో పడుకొని ఉండటంతో నన్ను ఎవరు సూడలా . నేరుగా ఇంటికి వచ్చి ఇంట్లో ఉన్న డబ్బులు రెండు జతల బట్టలు తీసుకొని ఊరి పొలమేర దాటి మేయిన్ రోడ్డు ఎక్కి సోమిరెడ్డి చెప్పుల్ను పారుతున్న కాలవలో వేసిన తెల్లారేసరికి రాయిచోటి ఘాట్ చేరుకొని దుప్పట్ని కాల్చేసి అక్కడ్నుంచి బైకు ను గూడా లోయలోకి తోసేసి కొద్దిదూరం వెళ్లి అక్కడ నిలబడిన లారీ ఎక్కిన . ఎక్కడెక్కడో తిరిగిన. సోమిరెడ్డిని చంపినా నాకు ఇంకా నా లాంటోళ్ల

చాల మంది బాధలు పడ్తుండారనిపించింది. చదువుకొనే టప్పుడు అన్నల్తో పరిచయం ముండే . వెనకా ముందు ఆలోచిస్తుంటి. ఇప్పుడు ఆ భావాలు నాలో మళ్లీ నిద్ర లేవడంతో నేరుగా వాళ్ల దగ్గరికే వెళ్లిపోయా" .

"నువ్వు తప్పు చేసావ్ నరేంద్ర. సోమిరెడ్డిని చంపకుండా ఉండాల్సింది. వాళ్లకు మనకు తేడా ఏముంది. " అన్నాడు రుద్ర.

"మా నాయన కాల్చుకొని సచ్చిపోయిండనుకోని కుమిలి కుమిలి ఏడ్చినం ఎందుకట్టా సేసుకొన్నాడని . గాని వోడు వచ్చి నేనే మీ నాయన్ను సంపినానని సెప్పినాక గూడా నేను సేతులు ముడుసుకొని ఎట్టా ఉండాలన్న . మా నాయన్ను అంత క్రూరంగా సంపినోన్ని ఎట్టా వదిలిపెట్టను. తప్పుసేసిగూడా వాడట్టా రెచ్చిపోయి మాటాడుతుంటే నా రక్తం మరిగిపోయినాది. అందుకే నేనూ ఘోరంగా సంపినా వోడ్ని . నేను వోడ్ని అక్కడ వదిలేసింటే నన్నో పిరికోడిలాగా సూసిండే వాడు. మంచిగా మారిండే వోడు కాదు. తన తప్పు ఒప్పుకొనే వోడుకాదు. అందుకే నేను సేసింది తప్పనుకోవడంలా . అబ్బిరెడ్డికి అదే గతి పట్టిండేది మా వోడి గురి తప్పకుంటే "

"తప్పులు మీద తప్పులు చేస్తూ పోతున్నవనిపిస్తుండాది" అన్నాడు.

"ఇది తప్పులు కాదన్న వోళ్లు చేసే తప్పులకు గుణ పాఠం. మీరు మంచి జరిగేదాని ఓ రకంగా పోరాడ్తూ యజ్ఞం సేస్తుండారు. మేము మా బాటలో అదే సేస్తుండాం. ఈ సారి మల్లా స్కెచ్ వేస్తాండాం. ఈ సారి తప్పించుకోలేదు వోడు. "

"వద్దు చంపడం వల్ల సమస్యలు పరిష్కారం కావు చట్టమే ఆ పని చేయాలి . దొరికి పోతే మీకు భవిష్యత్తనేదే ఉండదు. " అన్నాడు రుద్ర.

"కాని అన్నా అన్నిటికి తెగించినం. మాకు బతుకు మీది తీపిలేదు. మేం భయం భయంగానే తిరుగుతున్నామనుకొంటారు గాని మేము భయపడేది మేము దొరికి పోతామని సచ్చిపోతమని కాదు. సేయాల్సింది సానా ఉండాది అప్పుడే ఇట్టా జరిగిపోయినాదే అనేదే మా భయం. నాదేముందన్నా అబ్బిరెడ్డి సచ్చిదాంకా మీరు జాగ్రత్తగా ఉండండి. అమ్మను ఎప్పుడో ఓ పారి కలుస్తానని సెప్పండి. .నేను బతికుండా నంటే సంతోష పడ్తాది. "అంటూ మరికొంత సేపు మాట్లాడి. భారీగా పడుతున్న వర్శంలో చీకట్లోనే వెళ్లిపోయాడు నరేంద్ర. నరేంద్ర చెప్పిన దృశ్యమే కళ్లముందు కనపడుతుండగా హింసకు హింస సరైనా సమాధానం కాదు. కాని అణిచివేతకు అన్యాయానికి గురైనవాడి ప్రతి ఒక్కడి మానసిక పరిస్థితి అలాగే ఉంటుందేమో అవకాశం లేక అణగారిపోతుంటారు కాని అవకాశమే వస్తే తమకు అన్యాయం చేసిన వాళ్ల అంతు చూస్తారనిపించింది.

★★★

నెలరోజుల్లో మరి కొన్ని సంఘటనలు జరిగాయి. పరమేశానికి ఆరైగా మళ్లీ మైదుకూరులోనే పోస్టింగ్స్ ఇవ్వడంతో అక్కడే జాయిన్ అయ్యాడు. రుద్రను కలిసాడు అతను. కాకపోతే మునపటిలా అతనిలో ఉత్సాహం కరువైంది..

రుద్ర కోలుకొన్నాడు కాని బైట తిరగడం లేదు. రుద్ర సంధ్యల జాతకాలు చూసి పెళ్లికి మంచి రోజు నిర్ణయించేందుకు సిద్దమైన వేళ ఓ షాకింగ్ న్యూస్ ఒకటి బైటకొచ్చింది. త్వరలోనే అసెంబ్లీ రద్దుచేస్తారని ముందస్తు ఎన్నికలు వస్తాయని. దాంతో రుద్ర పెళ్లి నిర్ణయాన్ని వాయిదా వేసుకోవల్సి వచ్చింది.అబ్బిరెడ్డి పెద్ద గడం నుండి గట్టెక్కినట్లు ఫీలయ్యాడు. ఎందుకంటే రుద్ర వాళ్లు మైదుకూరు మండలంలో కొన్ని గ్రామాలే తిరిగి తనకు వ్యతిరేఖంగా ప్రచారం చేసి ప్రజలను తమ వైపు తిప్పుకొన్నారని తెలిసింది.. ఇంకా ఆలస్యమైతే రుద్ర మళ్లీ బైట తిరగవచ్చు. పరిస్థితి తనకు వ్యతిరేఖం మారవచ్చు . అది ఆగి పోయింది. ఇప్పుడు నోటిఫికేషన్ వస్తే ఈ కొద్ది పాటి సమయంలో వాళ్లు తిరిగి చేయగలిగిందిలేదు. కోర్టులో ఉన్న కేసు తీర్పు కూడా అంత త్వరగా వస్తుందేమో నన్న భయం ఉండదు. గెలిస్తే కొర్టు కేసుల్లోంచి కూడా తప్పించుకోవచ్చు. ఇక మిగలింది తన చిరకాల ప్రత్యర్థి. అతని చేతిలో రెండు మార్లు ఓడిపోయాడు. ప్రస్తుతం అతను వయసు మీద పడటంతోను అనారోగ్య కారణాల వల్ల తన కొడుకును రంగలోకి దింపాలనుకొంటున్నాడు. అది కూడా అబ్బిరెడ్డి కలిసి వచ్చేటట్లు చేసింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS